# భక్తి పారవశ్యం

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు శివనామస్మరణ చేస్తూ దర్శించుకున్నారు. అన్ని శివాలయాలు పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకొని ఆ దేవదేవుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మహేశ్వరంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, శంకర్‌పల్లి మండలం చందిప్ప మరకత శివలింగాన్ని నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు దర్శించుకున్నారు.**


చందిప్ప ఆలయంలో..

చందిప్ప ఆలయంలో దర్శనానికి వేచి ఉన్న భక్తులు





మొయినాబాద్‌లోని నాగలింగేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


చందిప్ప ఆలయంలో..


చందిప్ప ఆలయంలో..


తాండూరు భూకైలాస్ శివుడిని దర్శించుకుంటున్న భక్తులు


తాండూరు భూకైలాస్ శివుడు


తాండూరు భూకైలాస్ శివుడిని దర్శించుకునేందుకు నీటిలో నుంచి వెళుతున్న భక్తులు


వికారాబాద్ : మహాశివరాత్రి పండుగ సందర్భంగా వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం బుగ్గరామలింగేశ్వరాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాన్ని అందజేశారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


మహేశ్వర మహా పిరమిడ్ ఆవరణలో పత్రీజీ శక్తిస్థల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ దశరథ్‌నాయక్

## ధ్యాన జగత్‌కు సుభాశ్ పత్రీజీ సేవలు చిరస్మరణీయం

### మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ శక్తిస్థల్ భూమి పూజ

కడ్తాల్, మార్చి 8 : ధ్యాన జగత్‌కు సుభాశ్ పత్రీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల మహేశ్వర మహా పిరమిడ్ ప్రాంగణంలో శుక్రవారం ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ శక్తి స్థల్ నిర్మాణానికి స్థానిక నాయకులు, ధ్యానులతో కలిసి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుభాశ్ పత్రీజీ ధ్యానాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించారని తెలిపారు. ప్రపంచాన్ని శాకాహార జగత్‌గా మార్చడానికి ధ్యానాన్ని బోధించారని పేర్కొన్నారు. పత్రీజీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ధ్యానం రూపంలో ప్రతి ఒక్కరిలో ఉన్నారన్నారు. పత్రీజీ స్మారకార్థమే పిరమిడ్ ఆవరణలో శక్తిస్థల్ నిర్మాణాన్ని చేపట్టామని, వచ్చే ధ్యాన మహాసభల్లోగా ధ్యానులకు అందుబాటులోకి తెస్తామని వారు వివరించారు. కార్యక్రమంలో సుభాశ్ పత్రీజీ కుమార్తె పరిణీత, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, శ్రీరామ్‌గోపాల్, చంద్రశేఖర్, రాంబాబు, నీరజారెడ్డి, లక్ష్మి, మాధవి, రమేశ్ పాల్గొన్నారు.



# బీమాతో ధీమా

ప్రస్తుత కాలంలో వంట గ్యాస్ లేని కుటుంబంలేదు. ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారింది. ఒక్కోసారి గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అజాగ్రత్తల వల్ల పేలుళ్లు సంభవిస్తున్నాయి. దీనికి సంబంధించి ఆయా ఎల్పీజీ సంస్థలు అందిస్తున్న బీమా సదుపాయం వినియోగదారులకు ధీమా కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో వంటగ్యాస్ వల్ల ప్రమాదం సంభవిస్తే బీమా క్లెయిమ్ ఎలా చేసుకోవాలి... నిబంధనలు.. తదితర వివరాలు తెలుసుకోవాల్సిందే. - ఆదిబట్ల, మార్చి 8

### పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్

ఎల్పీజీ వినియోగదారులకు పబ్లిక్ లయబిలీటీ ఇన్సూరెన్స్ కింద బీమా సౌకర్యం కల్పిస్తున్నాయి. ఆయా కంపెనీల్లో నమోదైన ప్రతి ఖాతాదారుడికి ఇది వర్తిస్తుంది. ఈ పాలసీలో థర్డ్ బీమా కూడా మిళితమై ఉంటుంది.


### మృతులకు పరిహారం ఎలా..

గ్యాస్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే సుమారు రూ.6 లక్షలు, గాయాలైతే రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ప్రమాదం జరిగిన సమయంలో గృహోపకరణాలు, ప్రమాదం చోటు చేసుకున్న విధానం, ఇంటికి నష్టం జరిగితే సర్వేయర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రూ.2 లక్షల వరకు పరిహారం చెల్లిస్తారు. అలాగే వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ లీక్ వల్ల చుట్టుపక్కల ఉండే నివాసాల్లో ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి సంబంధించి మొత్తం కలిపి రూ.40 లక్షల బీమా వర్తిస్తుంది. సిలిండర్ పేలితే డిస్ట్రిబ్యూటర్‌కు వెంటనే సమాచారం అందించి, కంపెనీ పుస్తకం, బుక్ చేసుకున్న రశీదు, ప్రమాదం జరిగిన ఇంటి నంబర్, పరిహారం కోరుతూ అర్జీతో పాటు డిస్ట్రిబ్యూటర్ వద్ద ఉండే బీమా క్లెయిమ్ దరఖాస్తును పూర్తి చేసి అందజేయాలి. వంట గ్యాస్ ప్రమాదం, ఇన్సూరెన్స్ గురించి పౌరసరఫరాల శాఖకు ఎలాంటి సంబంధం ఉండదు.

### వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇండ్లు, హోటళ్లు, వసతి గృహాల్లో వంట గ్యాస్ వినియోగదారులు ప్రతి మూడు, ఆరు నెలలకోసారి గ్యాస్ పొయ్యిలను ఏజెన్సీ నియమించిన మెకానిక్‌లతో పరిశీలింపజేయాలి. రెగ్యులేటర్‌కు, పొయ్యికి అనుసంధానం చేసేందుకు నాణ్యమైన పైపునే వాడాలి. సిలిండర్‌కు దగ్గరలో మండే వస్తువులు ఉంచకూడదు. వంట గదిలోకి తగినంత గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. సిలిండర్‌ను సులువుగా బయటకు తెచ్చేందుకు అవకాశముండేలా ఏర్పాటు చేసుకోవాలి. సిలిండర్ ఎప్పుడూ నిలువుగా ఉండాలి. ఎట్టి పరిస్థితిల్లోనూ అడ్డంగా ఉంచరాదు. సిలిండర్ కంటే పొయ్యిని ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. గ్యాస్ లీకైనప్పుడు బరువైన మిథైన్ వాయువు భూమిని చేరి తర్వాత పైకి వస్తుంది. గ్యాస్ లీకైనట్లు అనుమానం వస్తే విద్యుత్ పరికరాలు, స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయొద్దు. రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసి మూతపెట్టాలి.

**వంట గ్యాస్‌కూ క్లెయిమ్**




**సిలిండర్ పేలితే రూ.40 లక్షల వరకు పరిహారం**

### కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు

* మరణాలు చోటు చేసుకుంటే మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం రిపోర్ట్, అగ్నిమాపక అధికారి నివేదిక, ప్రమాదం జరిగినట్లు రిపోర్ట్ పత్రాలు ఒరిజినల్స్ జతపరచాలి.
* గాయపడిన సందర్భాల్లో వైద్యుడి ప్రిస్క్రిప్షన్, మందులు కొనుగోలు చేసినట్లు దుకాణం నుంచి పొందిన బిల్లులు, ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు వైద్యుడి ధ్రువీకరణ పత్రం ఉండాలి. డిశ్చార్జి కార్డు జతచేయాలి.
* ఆస్తి నష్టానికి సంబంధించిన బీమా కంపెనీ సర్వేయర్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఉండాలి. లేకపోతే బీమా వర్తించదు.
* సిలిండర్ బుక్ చేసుకున్న ఇంటి నంబర్ కాకుండా మరో ఇంట్లో ప్రమాదం జరిగితే బీమా వర్తించదు.
* సిలిండర్ లీకైనప్పుడు మాత్రమే బీమా క్లెయిమ్ చేస్తారు. ప్రమాదానికి సంబంధించిన ప్రాంతం, వివరాలు, ఏడు రోజుల లోపు సంబంధిత బీమా కంపెనీకి అందినప్పుడే ఈ బీమా క్లెయిమ్ అవుతుంది.
* ఉద్దేశపూర్వకంగా ప్రమాదం సంభవించిందని వినియోగదారుడిపై అనుమానం వచ్చి పోలీస్ విచారణ జరుగుతున్నట్టయితే బీమా వర్తించదు.

### పరిహారం పొందాలంటే..

వంట గ్యాస్ సిలిండర్ పేలితే వెంటనే సంబంధిత కంపెనీ డిస్ట్రిబ్యూటర్ లేదా డీలర్‌కు విషయం తెలియజేయాలి. అతడు ఆ కంపెనీ సేల్స్ అధికారికి సమాచారం ఇస్తారు. ఈ క్రమంలో సేల్స్ అధికారి, స్థానిక తహసీల్దార్, ఇన్సూరెన్స్ సర్వేయర్, అగ్నిమాపకశాఖ అధికారి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. అనంతరం ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేస్తారు. గ్యాస్ సిలిండర్ ఎక్కడ బుక్ చేసుకుంటారో ఆ డీలర్ నుంచే ఇన్సూరెన్స్ కూడా క్లెయిమ్ అవుతుంది.

### గ్యాస్ ఏజెన్సీలు ఏం చేయాలి..

గ్యాస్ ప్రమాద బీమాపై సభలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. బీమాపై విస్తృత ప్రచారం చేపట్టాలి. వినియోగదారుల సేవలు, ప్రమాదాలు, పరిహారంపై సంస్థలు ఇచ్చే భరోసాపై చైతన్యం కలిగించాలి. ఏజెన్సీ ప్రతినిధులు రెండేండ్లకోసారి వినియోగదారులు వాడుతున్న గ్యాస్ పొయ్యిలు, సిలిండర్, రెగ్యులేటర్లను పరిశీలించాలి.

## మెడికల్ రంగంలో బకాయి వేతనాలు చెల్లించాలి

### కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహా

హిమాయత్‌నగర్, మార్చి 8 : మెడికల్ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే 17 వేల మంది ఉద్యోగులకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌హెచ్ఎం స్కీం కార్మికులకు జీతాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారని ఆయనపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాలేని బీజేపీ నాయకులు ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటు అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జీతాలు అందక పోవడంతో ఉద్యోగుల కుటుంబ పోషణ భారం అవుతుందని, కేంద్రం నుంచి నిధులు రావడంలేదనే సాకుతో ఉద్యోగులకు జీతాలు చెల్లించక పోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## నేత్రపర్వంగా దీపోత్సవం

పెద్దేముల్, మార్చి 8 : మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. మండల కేంద్రంలోని శంభులింగేశ్వర ఆలయంలో ఉదయాన్నే శివుడికి అభిషేకాలు చేశారు. టెంకాయలు కొట్టారు. సాయంత్రం ప్రత్యేకంగా శివుడికి పూజలను నిర్వహించి దీపోత్సవాన్ని శివలింగం ఆకారంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో శివపార్వతుల కళ్యాణాన్ని వేదపండితుల సమక్షంలో భక్తులు, గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించారు.

# టెట్ వేయాలని.. 11న చలో హైదరాబాద్

- టీచర్ పోస్టులను పెంచాలి
- డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 8: డీఎస్సీతో పాటు టెట్ వేసి, టీచర్ పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించడం అనవాయితీ అని, పక్క రాష్ట్రాలలో టెట్ వేసి విషయం ప్రభుత్వం గమనించి వెంటనే చర్యలు చేపట్టాని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా కృష్ణయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. టెట్ రాసి ఉత్తీర్ణత సాధించకుండా టీచర్ పోస్టు రాయడానికి అర్హత లేదని, నిరుద్యోగల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టెట్ నిర్వహించాలని కోరారు. నిరుద్యోగుల వయో పరిమితిని రెండేండ్లు పెంచడంతో ఎంతో మంది నిరుద్యోగుల జీవితాల్లో ఆశలు చిగురించాయన్నారు. అలాంటి వారికి డీఎస్సీ రాసుకునే అర్హత కల్పించకపోవడం, వయో పరిమితి పెంచి ఉపయోగం ఏంటని? ఒకసారి సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టెట్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. టెట్ నిర్వహించి ఆరు నెలలు అవుతున్నదని, అందులో పది శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారని, ఈ నేపథ్యంలో మరోమారు టెట్ నిర్వహించాలని కోరారు. డీఎస్సీ పరీక్ష నిర్వహణకు టెట్ నిర్వహణకు మధ్య మూడు నెలల వ్యవధి ఉన్నదన్నారు. గతంలో పోస్టులు తక్కువగా ఉండటం, సిలబస్ మారడం వల్ల చాలా మంది అర్హత సాధించలేకపోయారని అన్నారు. బీఈడీ, డీఈడీ పాసైన నిరుద్యోగులు టెట్ వేయకపోవడంతో తీవ్ర సంతృప్తితో ఉన్నారని, ఒక అవకాశం కోల్పోతామనే ఆవేదన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 24 వేల టీచర్ పోస్టుల ఖాళీగా ఉంటే కేవలం 11 వేల పోస్టులు భర్తీ చేస్తామనడం సరికాదన్నారు. 24 వేల టీచర్ పోస్టుల భర్తీకి, టెట్ వేసి డీఎస్సీ నిర్వహించాలనే డిమాండ్‌తో 11న ఇందిరా పార్కు వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

# మహిళలకు సన్మానం

### జేసీఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

శేరిలింగంపల్లి, మార్చి 8: శేరిలింగంపల్లిలోని చందానగర్ ఆరంభ్ టౌన్‌షిప్‌లో జేసీఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరంభ టౌన్‌షిప్ అ సోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర రాథోడ్, భిక్షపతి, రెహనా బేగం, రాజేశ్, దాసరి సరిత, రామారావు, నాగరాజు, జనార్ధన్, విక్రమ్ యాదవ్, మహేష్, సాయిరాం, జేసీఐ ప్రతినిధులు సుమతి, క్రాంతి, రవళి, భవిత, హౌస్ కీపింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### స్నేహ మోడల్ పాఠశాలలో..

మియాపూర్ , మార్చి 8 : ఆల్విన్ కాలనీ డివిజన్ ఇంద్రహిల్స్‌లోని స్నేహ మోడల్ పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.డివిజన్ బీఆర్ఎస్ యువ నాయకుడు రామకృష్ణ గౌడ్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మమతరాజ్, రాజు, శారద, వనజ, రేణుక ,సోనీ, సౌజన్య , సాయిప్రియ పాల్గొన్నారు.

## ట్యాంకర్ కిందపడి సైక్లిస్ట్ మృతి

శేరిలింగంపల్లి, మార్చి 8: ప్రమాదవశాత్తూ ట్యాంకర్ కిందపడి ఓ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేంద ర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఒడిషాకు చెందిన రమేశ్ బేహ్రా (43) శ్రీరాంనగర్‌కాలనీ ఎ బ్లాక్‌లో ఉంటూ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కాలనీ సి బ్లాక్‌లో సైకిల్‌పై వెళ్తున్నాడు. ప్రధాన రహదారిపై వస్తున్న ట్యాంకర్‌ను గమనించకుండా ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంకర్ వెనుక టైరు కిందపడడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.